# అదీ సంగతి !

"మన మూర్తి హైద్రాబాదు నుంచి రాలేదేంట్రా బాబూ... తాజా వార్తలు చెబుతా దనుకుంటే?! ఇవాళ గౌతమి ఎక్స్‌ప్రెస్‌కి వస్తానన్నాడు!" అన్నాడు అప్పారావు.

రాజమండ్రిలో ప్రభుత్వ కార్యాలయంలో చిరుగుమాస్తా అతను.

"అవునయ్యా! ఇంటికి ఫోను చెయ్యండి. నా సర్వీసు కండోనేషన్ విషయం సెక్రటేరియెట్‌లో కనుక్కొని వస్తానన్నాడు. ఈ వారంలో పని అయిపోతుందన్నాడు..." అన్నాడు ఆ కార్యాలయంలో హెడ్ గుమాస్తాగారు.

ఆయన ఆ మధ్యన ఆరు సంవత్సరాలు శెలవు పెట్టి ప్రభుత్వ ఖర్చుతో చిన్నవ్యాపారం చేశాడు. 'ప్రభుత్వ ఖర్చు' అంటే గవర్నమెంటు డబ్బు కాదు సుమండీ! అనగా ఉద్యోగంలో ఉండగానే శెలవు పెట్టి, శెలవులో ఉన్నంతవరకూ జీతం తీసుకుంటూ వ్యాపారం చేయడమన్న మాట! ఉద్యోగం ఉంటుంది, మరోప్రక్క వ్యాపారం జరుగుతుంటుంది. శెలవు అయిపోగానే జీతం నష్టంతో కొన్ని సంవత్సరాలు వ్యాపారం చేశాడు. జీతం నష్టంతో పాటుగా వ్యాపారంలో కూడా నష్టం వచ్చింది. ఇప్పుడు ఆ జీతం నష్టం శెలవును డ్యూటీ క్రింద ప్రభుత్వం మంజూరు చేస్తే కాని ఆయనకు ఫించను రాదు. అదీ సంగతి!

"అదిగో... మాటల్లోనే వచ్చాడు!" అన్నారు అందరూ ఒక్కసారిగా.

వదులుగా వుండే తెల్లని ఖద్దరు లాల్చీ, ఆ క్రింద పైజామా, మంచి ఎత్తు, ఎత్తుకు తగ్గ శరీరదారుఢ్యం, చామనఛాయ, జులపాల జుట్టు, గుబురు మీసాలు, గోల్డ్‌ఫ్రేమ్ కళ్ళజోడు వున్న వ్యక్తి ప్రవేశించాడు.

అతనే... మూర్తి!

అతనికి రెండువైపులా ఇద్దరు మనుషులు, వెనుక పదిమంది ఉద్యోగులు ఉన్నారు. హైదరాబాద్‌లో సెక్రటేరియెట్‌లోనూ, మంత్రులతోనూ పనులు చేయిస్తాననీ, ముఖ్యమంత్రి గారితో కూడా పరిచయం వుందనీ, వ్యాపారాలలో, సినీరంగంలో- అబ్బో... ఇలా ఒకటేమిటీ... అన్ని పనులూ చేయిస్తానని అందరికీ హామీలు ఇచ్చి, అందరి దగ్గర ఖర్చుల కోసం కొంత డబ్బు నొక్కేసి, తరచూ హైదరాబాద్ వెళ్ళివస్తుంటాడు. అందరూ అతన్ని- అతని మాటలు విన్న వెంటనే ఆశ్రయించకుండా ఉండలేరు. అతని మాటల గారడీ అటువంటిది. ఈ మధ్యనే 'దొంగనోట్ల పంపిణీ'లో కూడా చేరాడని అతని మిత్రబృందం అంటున్నారు.

అతన్ని చూసి ఆఫీసులో అందరూ ఆఫీసరుగారు వచ్చినట్లుగా లేచి నిలబడ్డారు.

"నమస్తే మూర్తిగారూ!" అన్నారు అందరూ ముక్తకంఠంతో.

ఆ ఆఫీసులో, ఆఫీసరుగారు అర్జంటు పనివుండి ఆఫీసులో ప్రవేశించినా ఇటువంటి మర్యాద దక్కుతుందో, లేదో తెలియదు. మూర్తి ఒక బల్లమీద దర్జాగా కాలు మీద కాలు వేసుకొని కూర్చుంటే... ప్రక్కనున్న వ్యక్తి కింగ్‌సైజు సిగరెట్ నోట్లో పెట్టాడు. మరొకడు వెలిగించాడు.

హెడ్ గుమస్తాగారు ఆత్రుతగా అడిగాడు-

"మూర్తీ! నా కేసు ఏమయింది? పోయినసారి వెళ్లినప్పుడు జనరల్ అడ్మినిస్ట్రేషన్‌లో ఫైలు వుంది, అయిపోతుందన్నావు. నేను ఇచ్చిన డబ్బు వాళ్ళకు ఇచ్చావా?" దీనంగా అప్పు కావాలని అడుగుతున్నట్లుగా వుంది ఆయన పరిస్థితి.

"చెప్తాను సర్... కంగారు పడకండి!" అన్నాడు.

"మా అబ్బాయిని ఇంటర్ ప్యాస్ చేయించమని మంత్రిగారితో చెప్తానన్నారు. కనుక్కున్నారా? మాయావిడ రోజూ చంపేస్తుందనుకో- అమ్మాయిని డాక్టరు చెప్పిస్తున్నారు... అబ్బాయి సంగతి చూడమని! అది తెలివైన పిల్ల- చదువుకుంటుంది బాగా! వీడేమో... ఎప్పుడూ క్రికెట్ చూస్తూ సరిగ్గా చదవడు. నేనేం చేయను? మరి, నేను ఇచ్చిన పదివేలు ఇచ్చి పదోర్యాంకు లోపుగా వచ్చేటట్లు చూస్తానని మంత్రిగారితో చెప్తానని అన్నారుగా! మంత్రిగారితో మాట్లాడారా? ఏం చేశారు?" అన్నాడు నారాయణ ఆందోళనగా.

"నారాయణా! నీకు కంగారు ఎక్కువ. చెప్తాను. అందరి పనులు పూర్తి చెయ్యకుండా నేను హైదరాబాద్ నుంచి రాను. తెలిసిందా?" అన్నాడు మూర్తి.

"సర్వీస్ కమీషన్‌లో మా తమ్ముడికి గ్రూప్-1 లో మంచి ర్యాంక్ తెప్పించి ఆర్.డి.వో. పోస్టుకు సెలెక్షన్ ఇప్పిస్తానన్నారు కదా! ఐదు రూపాయల వడ్డీకి యాభైవేలు తెచ్చి మీ చేతిలో పోశాను. ఏమయిందండీ?" అన్నాడు ఆవేదనతో ప్రకాశరావు.

"ప్రకాశరావుగారూ! గ్రూప్ ఒన్ అంటే ఏమనుకుంటున్నారు? మీలాగా బచ్చా సీనియర్ అసిస్టెంట్ పోస్టు అనుకుంటున్నారా? లైనులో పెట్టి వచ్చాను. ఈలోగా రిక్రూట్‌మెంట్ మీద కోర్టు కేసులు పడ్డాయట. అందువల్ల ఆలస్యమవుతుందేమో! కాస్త ఓపిక పట్టండి!" అన్నాడు మూర్తి.

ప్రకాశరావుకు నీరసం వచ్చింది.

ఈలోగా-

"సార్ రమ్మంటున్నారండీ!" అంటూ అటెండర్ వచ్చాడు.

మూర్తి ఆఫీసరుగారి గదిలో ప్రవేశించాడు.

"రావయ్యా మూర్తీ!" అంటూ కుషన్ ఛెయిర్ లోంచి లేచి మరీ ఆహ్వానించారు ఆయన.

తన పైఆఫీసర్ వచ్చినా అతికష్టం మీద తన సీట్లోంచి లేవని ఆయన- మూర్తిని తన సీటులోంచి లేచి ఆహ్వానించడంలో ఒక పరమార్థం వుంది. తన ప్రమోషన్ గురించి మంత్రిగారితో మాట్లాడి, తనపైన వున్న ఇద్దర్ని తప్పించి సీనియారిటీని ఓవర్‌లుక్ చేయించి

ప్రమోషన్ వచ్చేట్లు చేస్తానని- మూర్తి సాక్షాత్తు తన ఆఫీసర్‌గారి దగ్గరే లక్షరూపాయలు తీసుకువెళ్ళాడు... అదీ సంగతి!

"సర్! మీ ప్రమోషన్ విషయం..." అన్నాడు అతి వినయంగా మూర్తి.

అతని మాటలు పూర్తికాకుండానే "డిపార్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీ ఈ నెలలో కూర్చుంటుందన్నారు. మరి, మంత్రిగారిచేత నా పేరు చెప్పించారా మూర్తీ?" అన్నారాయన ఆత్రుతగా.

మూర్తి చాలా చాకచక్యంగా చేతులు అటూ ఇటూ తిప్పుతూ "భలేవారే సర్! మీకు ప్రమోషన్ రాకపోతే నేను సెక్రటేరియట్ ముందు ఆత్మాహుతి చేసుకుంటా... సరేనా?" అన్నాడు.

అంతే... ఆఫీసర్‌గారు తనకు తరువాతి ప్రమోషన్ అప్పుడే వచ్చేసినట్లు, తన ఏకైక కుమార్తె పెళ్ళి వైభవంగా చేయడానికి రాష్ట్రంలో సిబ్బంది అందర్నీ పిలిపించి చర్చిస్తున్నట్లు- కాసేపు 'ఎ..క్క..డి..కో.. వెళ్లిపోయారాయన.

ఈ పరిస్థితి చూసిన మూర్తి "సార్! హైదరాబాద్‌లో తిరిగి తిరిగి ఒళ్ళు హూనమై పోయింది. ఇంటికి వెళ్లి రిలాక్స్ అయి వస్తాను..." అన్నాడు.

"నిన్ను ఆఫీసుకి ఎవరు రమ్మన్నారోయ్! నీ పని ఎవడో ఒకడిచేత చేయిస్తాను. లేకపోతే నేను చేసుకుంటాను. వెళ్లు... వెళ్లు!" అంటూ తన సీట్లోంచి సాగనంపాడు మూర్తిని.

మూర్తి ఆఫీసరు గదిలోంచి బయటకు రావడం ఆలస్యం- ఉద్యోగులు అందరూ అతన్ని చుట్టుముట్టారు.

"మనకి కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా- మన ప్రభుత్వం సాధించిన విజయాలు దృష్టిలో పెట్టుకొని పదిశాతం జీతంలో బోనస్ ఇస్తారట. జీవోలు తయారయ్యాయి... వస్తున్నాయి!" అన్నాడు.

"భలే! భలే! మన ముఖ్యమంత్రి ఎలాగైనా గొప్పోడురా!" అనుకుంటూ ఒక గుంపు విడిపోయి ఎవరెవరికి ఎంత వస్తుందో, క్యాలిక్యులేటర్స్‌లో లెక్కలు వేసుకోసాగారు.

"ఉద్యోగులు ఎక్కువైపోయిన కారణంగా ప్రభుత్వం ఖర్చు తగ్గించాలని- ఏభై సంవత్సరాలు పూర్తి అయినవాళ్ళని రిటైర్ చేసి, ఆ రిటైరయిన వ్యక్తి కుటుంబంలో ఒకరికి కాంట్రాక్టు పద్ధతి మీద ఉద్యోగం ఇస్తారట. మన ఆఫీసులో అలాంటి వాళ్ళందరూ పేర్లు ఇవ్వండి. రిటైరవ్వకుండా తప్పించేస్తాను. నిన్న మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం జరిగిపోయింది!" అన్నాడు.

"చచ్చాం పో!" అనుకుంటూ ఇంకో గుంపు విడిపోయి లిస్టు తయారుచేయసాగారు.

"ప్రతి ఆఫీసర్‌కీ కంప్యూటర్స్ ఇస్తారుట. దాని ఖరీదు ప్రతినెలా జీతంలో తీసుకుంటారుట!" అన్నాడు.

'మనకెందుకులే... మనం ఆఫీసర్స్ కాదు కదా!' అనుకున్నారు అందరూ.

"మన హెడ్ గుమాస్తాగారి ఆరు సంవత్సరాల శెలవు వ్యవహారం జనరల్ అడ్మినిస్ట్రేషన్‌లో వుంది. అక్కడ 'బరువు' చాలలేదు. ఆయన్ని అక్కడికి తీసుకువెళ్లాలి" అన్నాడు.

దానికి హెడ్ గుమాస్తాగారు "మళ్లీ ఎక్కడినుంచి తేనురా మూర్తీ!" అన్నారాయన.

"భలేవారండీ! మీరు చేసిన బిజినెస్‌లో మరో పాతికవేలు నష్టం వచ్చిందనుకోండి... అంతే!"

ఆయన కృంగిపోయారు. అప్పటికే యాభైవేలు సమర్పించుకున్నారాయన.

"మీకు మరో ఆసక్తికరమైన విషయం చెప్పాలి. మన ఆఫీసరుగారి ప్రమోషన్ అని లక్షరూపాయలు ఇచ్చారు. అసలు ఈ మానవుడి పేరు చెప్తే చాలు- సెక్రటేరియట్‌లో నన్ను కరిచినంత పని చేస్తున్నారు. ఏం చేయాలో అర్థంకావడం లేదు. వారేమో లోపలకు వెళ్తే చాలు- తల డిప్ప తీసేసి చెంచాతో నా మెదడు తినేస్తున్నాడు. ఇదిగో చూడండి!" అంటూ తల వంచి చూపించాడు మూర్తి.

అందరూ నవ్వుతూ "అలాగా! ఆయనేమో పాపం- నువ్వు ప్రమోషన్ జీ.వో. తెస్తావని ఆశగా ఎదురుచూస్తున్నాడు. అయినా... వాడు చండశాసనుడు. అంతే అవ్వాలి. ఎప్పుడూ ఆఫీసులోనే చస్తాడు. క్యాంపులు కూడా ఉండవు. పదిన్నర నుంచి ఐదున్నర వరకూ సీటులో చస్తాడు. ఎప్పుడో డబ్బాడు ఫెవికాల్ వంపేయాలి సీట్లో! ఎప్పుడూ 'పనీ, పనీ...' అంటూ వేధిస్తాడు. కనీసం రోగం కూడా రాదు... పదిరోజులు శెలవు పెడతాడనుకుంటే!" అని అనుకుంటున్నారు మూర్తి చుట్టూ గుమిగూడిన సిబ్బంది.

ఆఫీసు ఎలా వుందంటే... చిన్న చేపల మార్కెట్‌లా వుంది.

మూర్తి మళ్లీ కాలు మీద కాలు వేసుకొని కూర్చున్నాడు. కాళ్లు విలాసంగా ఊపుతున్నాడు. చేతిలో సిగరెట్ పొగలు కక్కుతోంది. మరో ఇద్దరు మూర్తి ఇచ్చిన సిగరెట్స్‌తో పొగలు విరజిమ్ముతున్నారు. చుట్టూ ఉద్యోగస్థులంతా నిలబడివున్నారు గుంపుగా.

ఈలోగా ఒక సబ్ ఇన్‌స్పెక్టర్, నలుగురు పోలీసులు ఆఫీసరు గదిలోంచి బయటకు వస్తూనే "మూర్తి ఎవరు?" అన్నాడు ఎస్.ఐ.

"నేనేనండి..!" అంటూ కాలర్ ఎగరేసుకుంటూ ఆయన దగ్గరకు వెళ్లాడు మూర్తి. అయితే 'తన ప్రతిభ ఎస్.ఐ. దాకా వెళ్లింది. వీడికి కూడా ప్రమోషన్ కావాలేమో..!' అనుకుంటున్నాడు మూర్తి.

"యు ఆర్ అండర్ అరెస్ట్! ఛీటింగ్ కేసు మీద నిన్ను అరెస్ట్ చేస్తున్నాం!"

"అదేంటండీ! గవర్నమెంట్ ఆఫీసులో ఆఫీసర్ పర్మిషన్ లేకుండా నన్నెలా అరెస్ట్ చేస్తారు?" అన్నాడు మూర్తి- కొనితెచ్చుకున్న ధైర్యంతో.

"డామ్ డర్టీ! పద... అవన్నీ పూర్తి చేశాం!"

- అంటూ అక్కడ గుమిగూడిన అందర్నీ చూసి "మిమ్మల్ని, మీ ఆఫీసరుగారితో సహా అందర్నీ మోసం చేస్తున్నాడు. ఈ ఊళ్లో అన్ని ఆఫీసుల్లో, అందరి ఉద్యోగులతో ఇదే తంతు! ఇలాగే ఎందరో వ్యాపారస్థుల్ని కూడా మోసం చేశాడు. హైదరాబాద్ వెళ్లి ఆఫీసుల్లో పనులు చేయిస్తానని లక్షలకు లక్షలు వసూలు చేస్తున్నాడు. కాని, ఇతను ఎక్కడికీ వెళ్లడు. రోజూ బొబ్బర్లంక వెళ్లి తోటల్లో మందు, మగువ, పేకాటలతో కాలక్షేపం చేస్తున్నాడు. మాకు ఎన్నో కంప్లైంట్స్ వచ్చాయి. నెల రోజుల్నుంచి ఇతని కదలికల్ని గమనిస్తున్నాం!" అన్నారు సబ్ ఇన్‌స్పెక్టర్‌గారు.

ఇది ఇలావుండగా...

మరుక్షణంలో "మూర్తిగారూ... మీ మిసెస్‌గారు ఇల్లంతా ఖాళీ చేసి ఎవరితోనో వెళ్లిపోయారట! మీ ఇంటికి తాళం వేసి వుందట! ఇంటి దగ్గరనుంచి మనిషి వచ్చాడు!" అంటూ అటెండర్ వచ్చాడు. అతను మూర్తికి విధేయుడు.

"సరేలే! ఆయన ఇంటికి ఎప్పుడు వెళ్లాడు గనుక?! లంకల్లో తోటల్లో వుంటున్నాడు. ఆమె మంచిపనే చేసింది. వీడిలాంటి వాడితో ఏ స్త్రీ కాపురం చేస్తుంది?" అన్నారు ఎస్.ఐ.గారు.

హెడ్ గుమస్తాగారు కళ్ళుతిరిగి పడిపోయారు...

నారాయణ, ప్రకాశరావు పిచ్చిచూపులు చూస్తున్నారు...

లోపల ఆఫీసరుగారు అయితే- ఎస్.ఐ.తో మాట్లాడాక బాత్‌రూమ్‌లోకి వెళ్లి ఇంకా రాలేదు. ఏమయ్యిందో..?!

"ఏరా! ఇదంతా నిజమేనంటావా?" అంటున్నాడు హెడ్ గుమస్తాగారు- ప్రక్కనున్న అటెండర్‌తో.

ఆయన్ని గట్టిగా గిల్లాడు అతను.

"అదేమిటి? అలా గిచ్చేశావ్?" అన్నాడాయన చెయ్యి తుడుముకుంటూ.

"అయ్! నిజమేనని చెప్పడానికండీ!" అన్నాడు నవ్వుతూ.

ముందు సబ్ ఇన్‌స్పెక్టర్‌గారూ, సంకెళ్ళతో మూర్తి, వెనుక పోలీసులు, ఆ వెనుక ఆఫీసులో సిబ్బందీ-

ఇప్పుడు సపరివారంగా నడుస్తున్నాడు మూర్తి...

శ్రీకృష్ణ జన్మస్థానానికి!!

●

'ప్రియదత్త ' వారపత్రిక ... 6 నవంబర్' 2002 సంచికలో ప్రచురితం